క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి

● ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సూచన



ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న షంషేర్, మేడా భద్రీ

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని వైవీ నివాసంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్, ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మేడా భద్రీనాథ్‌లు వైవీ సుబ్బారెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉండాలని వైవీ తమకు సూచించినట్లు వారు చెప్పారు.

మానసిక వికలాంగ విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు ఆహారం అందజేస్తున్న డా.జి.కె.మోహన్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్లరోడ్డులో ఆది ఆంధ్ర ఎడ్యుకేషనల్ సొసైటీ వారి మానసిక వికలాంగుల పాఠశాలలోని విద్యార్థులకు కంటి వైద్యుడు జి.కె.మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం పండ్లు, ఆహారం, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, వైద్యశాల సిబ్బంది పీరయ్య, లింగేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభం



తురిమెళ్లలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ప్రిన్సిపాల్

కంభం: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ఇంటర్మీడియెట్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రవేశ పెట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల, తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. కార్యక్రమంలో తురిమెళ్ల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ సోని, కంభం ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ జీ తిరుమలయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, ఎంపీడీఓ వీరభద్రాచారి, ఎంఈఓలు మాల్యాద్రి, శ్రీనివాసులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బ్రెయిలీకి ఘన నివాళి



బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈఓ

కొనకనమిట్ల: మండలంలోని ఎదురాళ్లపాడు భవిత కేంద్రంలో బ్రెయిలీ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ–2 నరసింహారావు కార్యక్రమంలో పాల్గొని చిన్నారులతో కలిసి బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాలు వేసి కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్లు పంచి పెట్టారు. ఎంఈఓ మాట్లాడుతూ బ్రెయిలీ తన 4వ ఏట చూపును కోల్పోయినట్లు పేర్కొన్నారు. ఆరు చుక్కల బ్రెయిలీని కనుగొని చూపు లేని వారి పట్ల ఆరాధ్యదైవంగా మారాడన్నారు. ఐఈడీ రిసోర్స్ పర్సన్ పద్మజ, పాఠశాల హెచ్ఎం ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి వాసవీ క్లబ్ విరాళం

మార్కాపురం: విజయవాడలో ఈ నెల 5వ తేదీన జరిగే హైందవ శంఖారావం కార్యక్రమానికి మార్కాపురం వాసవీ క్లబ్, రూమ్ నెట్‌ఫ్రెండ్స్ ప్రతినిధులు 15 వేల రూపాయల విరాళాన్ని శనివారం వీహెచ్‌పీ నాయకులైన ఇమ్మడిశెట్టి వీరారావు, మేడా ప్రసాద్‌లకు అందించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు జి.ప్రసాద్, కోశాధికారి సూరె శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు జి.రామకృష్ణారావు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

అంగన్‌వాడీలకు అద్దెపాట్లు

● అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు
● అసౌకర్యాల నడుమ చిన్నారులు, సిబ్బంది అవస్థలు

మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు 48
సొంత భవనాలు: 19
అద్దె భవనాలు: 20
ప్రభుత్వ స్కూళ్లలో నడుస్తున్న కేంద్రాలు 9



అనుమలవీడులో అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ కేంద్రం

రాచర్ల: రాచర్ల మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. కనీస సదుపాయాలు కరువై అంగన్‌వాడీలు, చిన్నారులు నానా అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఈ కేంద్రాలకు సరఫరా చేసే సరుకులు, చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులను ఉంచేందుకు కూడా చాలీచాలని అద్దె భవనాలతో కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 80 శాతంపైగా కేంద్రాలకు పక్కా భవనాలు లేవు. 14 పంచాయతీల్లో 48 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, సొంత భవనాలు 19, వాటిల్లో 20 కేంద్రాలు అద్దె భవనాలు ఉన్నాయి. మిగతా 9 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన భవనాల్లో ఏర్పాటు చేశారు. 2014–15 తెలుగుదేశం ప్రభుత్వంలో 9 అంగన్‌వాడీ భవనాలు కొత్తగా నిర్మాణాలు ప్రారంభించి మధ్యలోనే నిలిపేయడంతో దిష్టిబొమ్మల్లా దర్శమిస్తున్నాయి. దీంతో అద్దె భవనాల్లో మరుగుదొడ్లు లేక, తాగునీటి సదుపాయం లేక పోవడంతో గ్రామాల్లో అరకొర సదుపాయాలతో ఉన్న భవనాలతో అంగన్‌వాడీ కార్యకర్తలు అలాగే నెట్టుకొస్తున్నారు. కనీస సదుపాయాలు లేని అద్దె భవనాల్లో నెలకు రూ.2 వేలు అద్దె కడుతూ ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని భవనాలు వర్షాలకు కారుతున్నాయి.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణాలు

మండలంలోని ఆరవీటికోట, జేపీ చెరువు, అక్కపల్లె, అనుమలవీడు, యడవల్లి, పలుగుంటిపల్లె గ్రామాల్లో బడ్జెట్ సరిపోకపోవడంతో అంగన్‌వాడీ భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. భవనాలకు ప్రభుత్వ మంజూరు చేసిన బడ్జెట్ సరిపోక పోవడంతో కాంట్రాక్టర్లు భవన నిర్మాణాలను పూర్తిగా నిలిపేశారు.



అచ్చంపేటలో అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



అనుమలవీడులో రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

నిత్యం అవస్థలే...

సొంత అంగన్‌వాడీ భవనం లేకపోవడంతో రేకుల షెడ్డుల్లో అద్దెకు ఉంటున్నాను. అద్దె గదుల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి దానికి సమస్యే. ఈ కేంద్రాల్లో సరుకులు పెట్టుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నాం. అద్దె గదులకు సరైన సదుపాయాలు లేకపోవడంతో పౌష్టికాహారాన్ని, ఆట వస్తువులను, వంట సామగ్రిని కాపాడుకోవడం కష్టతరంగా మారుతోంది.

– కాశమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త, అనుమలవీడు

నైపుణ్య అభివృద్ధి శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలి

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘం మెప్మా ఆధ్వర్యంలో వివిధ రకాలైన సేవలు అందించే వారి కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణకు అర్హులైన వారు ఈ నెల 8వ తేదీలోపు మెప్మా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కమిషనర్ నారాయణరావు శనివారం తెలిపారు. ప్లంబర్, ఎలక్ట్రీషియన్, ఏసీ రిపేర్లు, టీవీ, వాషింగ్ మిషన్, బ్యూటీషియన్ తదితర రంగాల్లో శిక్షణ పొందేవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వీరికి ఎన్ఎస్‌డీసీ ద్వారా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు అర్హత పొందిన వారికి హోమ్ ట్రైనింగ్ ప్లాట్‌ఫాం ద్వారా వీరిని ఆన్‌బోర్డు చేసి జీవనోపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులతో పాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్, పాన్‌కార్డు జిరాక్స్ కాపీలను మెప్మా కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 79016 10223, 79016 10232, 79016 10241 నంబర్లు సంప్రదించాలన్నారు.

హెల్మెట్ లేని 30 మందికి జరిమానా



ప్రయాణికులకు జరిమానా విధిస్తున్న ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం: హెల్మెట్ లేకుండా బైక్‌పై ప్రయాణిస్తున్న 30 మందికి జరిమానా విధించినట్లు టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్ రావు తెలిపారు. శనివారం పట్టణంలోని పలు కూడళ్లలో ఆయన తన సిబ్బందితో కలిసి హెల్మెట్ లేని ప్రయాణికులను ఆపి జరిమానా విధించారు. పలువురికి కౌన్సిలింగ్ ఇచ్చారు. టూవీలర్‌పై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని చెప్పారు.

సావిత్రీబాయి పూలే సేవలు చిరస్మరణీయం



గొట్లగట్టు కస్తూరిబా గాంధీ పాఠశాలలో..



మహిళా ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న నిర్వాహకులు

కొనకనమిట్ల: మహిళల అభ్యుదయానికి, బాలికల విద్యకు శ్రీకారం చుట్టిన ధీరోధాత్రి సావిత్రీబాయి పూలే అని గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, జెడ్పీ పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి అన్నారు. మొదటి మహిళా ఉపాధ్యాయిని, తొలి మహిళా సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయా పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలు, సతీసహగమనం రూపు మాపేందుకు అవిరళ కృషి చేశారని విద్యార్థులకు వివరించారు. పాఠశాల బాలికలు సావిత్రిబాయి వేషధారణలు వేసి పాఠశాలలో విద్యను బోధించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

గిద్దలూరు రూరల్: ప్రతి ఉపాధ్యాయిని సావిత్రిబాయిపూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఆర్ట్స్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి అన్నారు. మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ముండ్లపాడు గ్రామంలో గంజి భద్రయ్య ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయినులకు సన్మానం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాలకు ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

కొనకనమిట్ల: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలని గొట్లగట్టు ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ పృధ్వీరాజ్ అన్నారు. మండలంలోని గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ పర్యవేక్షణలో శనివారం పాఠశాల బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి పలు సూచనలు అందజేశారు. పాఠశాల బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే తెలియజేయాలని డాక్టర్ పేర్కొన్నారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు గురి కాకుండా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పరిసరాల పరిశుభ్రత, భోజనానికి ముందు తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు.



బాలికలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవునికి శాంతి కళ్యాణం



కళ్యాణం అనంతరం భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కళ్యాణం అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణం అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాస రెడ్డి, కళ్యాణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు రామడుగు కోటేశ్వరరావు, కార్యదర్శి ఆర్‌వీ సుబ్బారావు, కోశాధికారి పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

యాప్‌లపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

బేస్తవారిపేట: ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సలకలవీడు శంకర్‌రెడ్డి ఫార్మసీ కళాశాల ఆవరణలో మార్కాపురం, గిద్దలూరు డివిజన్లలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యాప్‌లో చీడపీడలు ఆశించిన పంటల ఫొటోలు తీసి పెట్టడంతో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు అందజేస్తారన్నారు. రైతులు అనవసరమైన మందులు వాడకుండా నివారించవచ్చని చెప్పారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది రబీలో ఇన్సూరెన్స్ చేయించుకున్న రైతులకు పంట ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. 2024 రబీ సీజన్‌లోని పంటలను ఈ పంట నమోదును త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ శనగ పంటలో పచ్చ పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాము ఎకరాకు పిచికారి చేసుకోవాలని, వివిధ పంటల్లో వచ్చే చీడపీడలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. సలకలవీడు పరిసర ప్రాంతాల్లో పలు పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ సాంకేతికాధికారి శ్రీనివాసనాయక్, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డీ బాలాజీనాయక్, వ్యవసాయాధికారులు, ఏఈఓలు, ఎంపీఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు ఆదర్శంగా ఉండాలి



మాట్లాడుతున్న సీడీపీఓ సుధామారుతి

కొనకనమిట్ల: అంగన్‌వాడీ కేంద్రాలు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని, క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేసి పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో అందజేసి కేంద్రాలకు మంచి పేరు తీసుకురావాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుధామారుతి అన్నారు. శనివారం మండలంలోని చినారికట్ల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు వివరించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ కేంద్రాల పనితీరు సక్రమంగా ఉండాలని, కేంద్రాల్లోని చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందజేయాలని కార్యకర్తలకు సూచించారు. ముఖ్యంగా కార్యకర్తలు గ్రామాల్లోని బాలింతలు, గర్భిణుల పట్ల తీసుకోవాల్సిన విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం సక్రమంగా అందజేయాలన్నారు. కేంద్రాల్లోని చిన్నారుల బరువు చూడటం, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలపై బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు సరిత, ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం రూరల్: భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి సమస్యల పరిష్కారం కోసమే మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మండలంలో అనేక గ్రామాల్లో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకే సదస్సులు ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. భూ సమస్యలను కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని తెలిపారు. పొలం గట్ల విషయంలో సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులో అర్జీ సమర్పిస్తే విలేజీ సర్వేయర్, మండల సర్వేయర్ ముందుగా మీకు తెలియజేసి గ్రామానికి వచ్చి కొలతలు వేసి సమస్యను పరిష్కరిస్తారని చెప్పారు. తహసీల్దార్ చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ బత్తి శ్రీనివాసులు, చెన్నకేశవస్వామి గుడి ఈఓ శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సులు గ్రామాల్లో దీర్ఘకాలికంగా ఉన్న భూసమస్యల పరిష్కారానికి చక్కటి అవకాశం ఉందని తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం పొదిలి మండలం ఏలూరు పంచాయతీలోని టి.సల్లూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, అధికారులు సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మ్యూటేషన్లు, భూవివాదాలు, భూ ఆక్రమణలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. వీఆర్వో కిలారి సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.30 వేల విరాళం

మార్కాపురం: పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా శాశ్వత అన్నదాన భవన నిర్మాణానికి 30 వేల రూపాయల విరాళాన్ని ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ మార్కాపురం తాలూకా యూనిట్ కార్యదర్శి వడ్లమాని శ్రీనివాసరావు, మందిరం వ్యవస్థాపక కార్యదర్శి గోపాలుని హరిహర రావుకు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులును సన్మానించారు. దాతల సహకారంతో నిత్యాన్నదాన సత్రాన్ని నిర్మిస్తున్నట్లు హరిహరరావు చెప్పారు. దాతలు తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ తహసీల్దార్‌గా చిరంజీవి



సబ్ కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్: రెవెన్యూ శాఖ పరంగా ప్రజలకు అందించే సేవలు, సమస్యల పరిష్కారం, స్నేహపూరిత వాతావరణం, రికార్డుల నిర్వహణ తదితర అంశాల ఆధారంగా మార్కాపురం సబ్ కలెక్టర్ నూతనంగా ప్రవేశ పెట్టిన ప్రతినెలా బెస్టు తహసీల్దార్ అవార్డును రెండోసారి కూడా మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి శనివారం సబ్ కలెక్టర్ త్రివినాగ్ చేతుల మీదుగా తహసీల్దార్ కార్యాలయంలో అందుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది సహకారంతోనే తాను రెండోసారి అవార్డు అందుకున్నట్లు తెలిపారు. నవంబర్ నెలకు కూడా బెస్ట్ తహసీల్దార్ అవార్డు అందుకున్నారు.

ఒన్ స్టాప్ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పొదిలి: ఒన్‌స్టాప్ ఫెసిలిటీ సెంటర్‌ను డీఆర్‌డీఏ–వెలుగు ప్రాజక్టు డైరెక్టర్ తేళ్ల రవికుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదిలి, కొనకనమిట్ల మండలాల పొదుపు గ్రూపు మహిళలకు సెంటర్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రెండు మండలాలకు కలిపి 300 మంది ఎంటర్ ప్రెన్యూర్ లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న వారు, వారి కుటుంబ సభ్యులు ఎంటర్ ప్రైజెస్ పెట్టుకునేందుకు అర్హత ఉంటుందన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్క ఇంటికి ఎంటర్ ప్రెన్యూర్ పెట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. లీడ్ బ్యాంక్ డ్రిస్టిక్ట్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా స్త్రీ నిధి విభాగంలో బ్యాంకు లింకేజీ, ఓఎస్ఎఫ్ ద్వారా నిధులు పొందే అవకాశం ఉందన్నారు. ఏపీఓ గోపాలరెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సిద్ధం కావాలి



ప్రతిభ చాటిన విద్యార్థులతో యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

మార్కాపురం టౌన్: బాగా చదివి పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావాలని ప్రజ్ఞ వికాస పరీక్ష విజేతలను యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఓవీ వీరారెడ్డి ఆకాంక్షించారు. శనివారం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ప్రజ్ఞ పరీక్ష విజేతలకు అభినందన సభ ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సాయి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యయనం, పోరాటం అనే నినాదంతో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేయడమే కాకుండా చదువుల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ మాట్లాడుతూ గత నెల డిసెంబర్ 24న జిల్లా వ్యాప్తంగా పోటీ పరీక్షలు నిర్వహిస్తే సుమారు 10వ తరగతికి చెందిన 5 వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. రఫీ మాట్లాడుతూ పరీక్ష రాసిన ప్రతి స్కూల్ నుంచి మొదటి ముగ్గురికి అభినందిస్తూ సర్టిఫికెట్లు ఇచ్చామన్నారు. విద్యార్థుల అభివృద్ధికి రాబోవు రోజుల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.చంద్రశేఖరరెడ్డి, మాజీ జిల్లా నాయకులు డీకేఎం రఫీ, నాయకులు రామాంజి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.